నమస్తే తెలంగాణ
కరీంనగర్
5 | కరీంనగర్, ఆదివారం 4 ఫిబ్రవరి 2024 | KARIMNAGAR

ముగిసిన త్యాగరాజ ఆరాధనోత్సవాలు

పాల్గొన్న నెదర్లాండ్స్ మహిళ

సంగీత కచేరి చేస్తున్న లత బృందం

వేములవాడ టౌన్, ఫిబ్రవరి 3 : గత ఐదు రోజులుగా రాజన్న ఆలయ ఓపెన్ స్లాబ్‌పై నిర్వహిస్తున్న త్యాగరాజస్వామి వారి ఆరాధనోత్సవాలు శనివారం ముగిసాయి. కళాకారులు తమదైన ఆలాపనలతో అహూతులను మంత్రముగ్ధులను చేశారు. ధర్మపురికి చెందిన సంగనభట్ల కిషన్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణుని రాయభారం శ్రీ లక్ష్మీనర్సింహ నాట్యమండలి పౌరాణిక నాటక ప్రదర్శన ఆద్యంతం రంజింపజేసింది. కాగా, ఉత్సవాల్లో నెదర్లాండ్స్ దేశానికి చెందిన సద్గురు జగ్గీ వాసుదేవ్ ఈషా ఫౌండేషన్ కార్యకర్త శ్రీమతి సుసాన్ సమాధానీ పాల్గొన్నారు. ప్రపంచ దేశాలు తిరిగి పర్యావరణ పరిరక్షణ చేయడం అనే నినాదంలో భాగంగా శనివారం వేములవాడకు వచ్చినట్లు ఆమె తెలిపారు. ఆమెను ఆలయ ఈవో కృష్ణప్రసాద్ వేదిక మీదకు ఆహ్వానించారు.

హుజూరాబాద్: మాట్లాడుతున్న కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, వేదికపై ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, పాడి కౌశిక్‌రెడ్డి

మహిళలకు క్యాన్సర్ ముప్పు

- పంజా విసురుతున్న సర్వైకల్ క్యాన్సర్
- ప్రాథమిక దశలో గుర్తిస్తే నివారణ సాధ్యమే
- ఆలస్యం చేస్తే ప్రాణాలకే ప్రమాదం
- ఉమ్మడి జిల్లాలో పెద్ద సంఖ్యలో కేసులు
- నేటి నుంచి నాలుగు రోజులపాటు మహిళలకు ఉచిత వైద్య శిబిరం
- ప్రతిమ, చల్మెడ క్యాన్సర్ ఇనిస్టిట్యూషన్ల ఆధ్వర్యంలో నిర్వహణ
- సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎంపీ వినోద్ కుమార్ సూచన
- నేడు ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం

మహిళలను క్యాన్సర్ ముప్పు వెంటాడుతున్నది. ఒకప్పుడు రొమ్ము క్యాన్సర్ లాంటివి ఉంటే.. ఇప్పుడు గర్భాశయ ముఖద్వార (సర్వైకల్) క్యాన్సర్ భయపెడుతున్నది. నేషనల్ క్యాన్సర్ పర్సనల్ రికార్డ్స్ (ఎన్‌సీఆర్‌పీ) అంచనా ప్రకారం దేశంలో ఏటా కొత్తగా ఏడు లక్షలకుపైగా కేసులు నిర్ధారణ అవుతుంటే.. అందులో 63 శాతం మంది ప్రాణాలు కోల్పోవడం పరిస్థితికి అద్దం పడుతున్నది. అందుకు అనేక కారణాలు కనిపిస్తుండగా, ప్రభుత్వ వైద్యశాలల్లో క్యాన్సర్ నిర్ధారణ, చికిత్స సదుపాయాలు లేకపోవడం కూడా మరో కారణం అవుతున్నది. ఈ మహమ్మారి లక్షణాలపై అవగాహన లేకపోవడం, ప్రాథమికదశలో చికిత్సవైపు అడుగులు వేయకపోవడం కూడా ప్రాణాలను బలిగొంటున్నాయి. నిజానికి ఉచిత అవగాహన శిబిరాలు నిర్వహించి ప్రజలను ముఖ్యంగా మహిళను చైతన్యం చేయాలని అనేకసార్లు ప్రపంచ ఆరోగ్య సంస్థలు హెచ్చరించినా.. దానిని పెడచెవిన పెట్టడం వల్లే ఈ సమస్య పెనుభూతంలా మారిందన్న విమర్శలున్నాయి. అయితే, ఇటీవలి కాలంలో సర్వైకల్ క్యాన్సర్ పెరుగుతున్న నేపథ్యంలో కేంద్రం కొంత దృష్టి పెట్టినట్టు తెలుస్తున్నా.. ఈ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ చూపితేనే ఈ ముప్పు నుంచి బయటపడే అవకాశాలున్నాయి. ఈ పరిస్థితుల్లో ప్రతిమ, చల్మెడ కాన్సర్ ఇన్‌స్టిట్యూషన్ల సహకారంతో మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో నేటి నుంచి నాలుగు రోజుల పాటు కరీంనగర్‌లో మహిళలకు ఉచిత క్యాన్సర్ అవగాహన, నిర్ధారణ పరీక్షల వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. మహిళలు సద్వినియోగం చేసుకోవాలని వినోద్‌కుమార్ సూచించారు.

కరీంనగర్, ఫిబ్రవరి 3 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఇటీవలి కాలంలో క్యాన్సర్ ముప్పు పెరుగుతున్నది. దేశం, రాష్ట్రం, ఉమ్మడి జిల్లాలో మెల్లమెల్లగా విజృంభిస్తున్నది. అవగాహన లేక ఆ మహమ్మారిని గుర్తించలేని పరిస్థితి ఉంటున్నది. తీరా గుర్తించే సమయానికి అప్పటికే పరిస్థితి చేజారి పోతున్నది. దీంతో ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారు. దేశంలో ఎన్‌సీఆర్‌పీ అంచనాల ప్రకారం.. ఏడాదిలో ఏడు లక్షలకుపైగా క్యాన్సర్ కేసులు నిర్ధారణ అవుతున్నట్టు తాజా గణాంకాలు వెల్లడిస్తున్నాయి. అందులో 63 శాతం మంది ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. ప్రసిద్ధ లాన్సెట్ పత్రిక ఇటీవల వెల్లడించిన వివరాల ప్రకారం 2019 సంవత్సరంలో దేశవ్యాప్తంగా 12 లక్షల కొత్త క్యాన్సర్ కేసులు నమోదయ్యాయి. అదే ఏడాది ఈ మహమ్మారి బారిన పడ్డ 9.30 లక్షల మంది ప్రాణాలు గాల్లో కలిశాయి. ఆసియా మొత్తం మీద చూస్తే క్యాన్సర్ మరణాల్లో చైనా తర్వాత ఇండియా రెండో స్థానంలో ఉన్నది.

పెరుగుతున్న సర్వైకల్ క్యాన్సర్

సర్వైకల్ క్యాన్సర్ హ్యూమన్ పాపిలోమా వైరస్ (హెచ్‌పీవీ) ద్వారా సోకుతుంది. దీనిని పాప్‌స్మియర్ టెస్టు ద్వారా ముందే గుర్తించవచ్చు. ప్రతి రెండు మూడేళ్లకోసారి ఈ టెస్టు చేసుకోవడం ద్వారా వ్యాధి బారి నుంచి తప్పించుకునే అవకాశమున్నది. అయితే, చాలా మందికి అవగాహన లేక.. వ్యాధి లక్షణాలు తెలియక వైద్యులను సంప్రదించడం లేదు. దీంతో వ్యాధి ముదురుతున్నది. తర్వాత ట్రీట్‌మెంట్ మొదలు పెట్టినా ప్రాణాలు కాపాడడం కష్టమవుతున్నది. మహిళలు ఎక్కువగా సర్వైకల్ క్యాన్సర్ బారిన పడుతున్నట్టు ఇటీవల అనేక సర్వేలు చెబుతున్నాయి. రాష్ట్రంలో ఏటా 15 వేల కేసులు నమోదవుతున్నట్టు ఎంఎన్‌జే క్యాన్సర్ హాస్పిటల్ వర్గాలు తాజాగా వెల్లడించాయి. అలాగే, ఏటా నమోదవుతున్న కేసుల్లో 13 వాతం సర్వైకల్ క్యాన్సర్‌వే ఉంటున్నట్టు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ క్యాన్సర్ ప్రమాదాన్ని గుర్తించి న కేం ద్రం, దీనిపై ప్రత్యేక దృష్టి సారించినట్టు కనిపిస్తున్నది. 9 నుంచి 14 ఏండ్ల బాలికలు దీని బారిన పడకుండా ఉండేందుకు వ్యాక్సినేషన్‌ను ప్రోత్సహిస్తామని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగంలో చె ప్పారు. గర్భాశయ క్యాన్సర్ నివారణకు సీరం ఇనిస్టిట్యూట్ దేశీయంగా సర్వవ్యాక్ వ్యాక్సిన్ డోస్‌ను రూ.2 వేలకు అందుబాటులోకి తెచ్చింది. వ్యాక్సిన్ ధరలు తగ్గింపుపై కేంద్ర ప్రభుత్వం ఫార్మా కంపెనీలతో చర్చలు జరుపుతున్నట్లుగా వార్తలు వస్తున్నా.. స్పష్టత మాత్రం లేదు.

ప్రభుత్వ దవాఖానల్లో సేవలు అవసరం

మహిళలు సర్వైకల్‌తోపాటు వివిధ క్యాన్సర్ల బారిన పడుతున్నారు. రొమ్ము, పెద్దపేగు, ఉదర, చర్మ, రక్త, ప్రొస్టేట్, కాలేయ.. వంటి క్యాన్సర్ల బాధితులవుతున్నారు. అధిక బరువు కారణంగా తలెత్తే క్యాన్సర్లు.. పురుషుల కన్నా, మహిళల్లోనే ఆరు రెట్లు ఎక్కువ ఉంటున్నాయి. అయితే, దేశంలో ప్రస్తుతం వందమందిలో ఒక్కరే ముందస్తుగా క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయించుకుంటున్నట్టు సర్వేల్లో వెల్లడవుతున్నది. చాలామంది వ్యాధి ముదిరిన తర్వాత దవాఖానలకు వెళ్తుండడంతో ప్రాణాపాయం తలెత్తుతున్నది. నిజానికి దీనికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం కూడా ఒక కారణం అవుతున్నది. మెజారిటీ జిల్లా స్థాయి దవాఖానల్లో మహమ్మారి నిర్ధారణ, ట్రీట్‌మెంట్ సదుపాయాలు అందుబాటులో లేవు. దాంతో అందరూ నగరాలకు వెళ్లాల్సి వస్తున్నది. అక్కడి హాస్పిటళ్లలో చికిత్స కోసం చేసే ఖర్చుతో చాలా కుటుంబాలు సర్వం కోల్పోయి రోడ్డున పడే దయనీయ స్థితి ఉంటున్నది. చివరికి వైద్యం చేయించుకోలేని దుస్థికి చేరుకోవడం కనిపిస్తున్నది. నిజానికి పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఇది పెను భారంగా మారుతున్నది. దీన్ని తప్పించాలంటే.. ప్రభుత్వ దవాఖానల్లో క్యాన్సర్ నిర్ధారణ, చికిత్సలను అందుబాటులోకి తేవాలన్న డిమాండ్ ఎన్నటి నుంచో వస్తున్నది. క్యాన్సర్ ఔషధాలు తక్కువ ధరకే లభించేలా కేంద్రం వెంటనే చర్యలు తీసుకోవాల్సిన అవసరమున్నది. మనుషుల్లో వచ్చే 18 రకాల క్యాన్సర్లను ప్రాథమిక స్థాయిలోనే గుర్తించేందుకు అమెరికా పరిశోధకులు డీఎన్‌ఏ పరీక్షను కనుగొన్నారు. ఇలాంటి అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని మన దేశంలో కూడా అతి తక్కువ ధరకే అందుబాటులోకి తెస్తే లక్షల మందికి మేలు కలుగుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

నాలుగు రోజులపాటు ఉచిత శిబిరం

ప్రతిమ క్యాన్సర్, చల్మెడ కాన్సర్ ఇన్‌స్టిట్యూట్ సహకారంతో కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ ఆధ్వర్యంలో నేటి నుంచి ఈ నెల 7 వరకు ఉచిత క్యాన్సర్ అవగాహన, నిర్ధారణ పరీక్షల వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. కరీంనగర్ గాంధీ రోడ్డులోని టీటీడీ కల్యాణ మండపంలో శనివారం ఉదయం 9 గంటలకు క్యాంపు ప్రారంభిస్తారు. ప్రతి రోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు నాలుగు రోజుల పాటు శిబిరం ఉంటుందని, అందులో ఉచిత కన్సల్టేషన్, పరీక్షలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. క్యాంపు వివరాల కోసం 9100033082 ఫోన్ నంబర్‌లో సంప్రదించవచ్చని తెలిపారు. అలాగే, గర్భాశయ ముఖద్వార (సర్వైకల్) క్యాన్సర్ లక్షణాలను వివరించారు. రొమ్ము పరిమాణం లేదా ఆకృతిలో మార్పు రావడం, రొమ్ములో ఏదైనా ముద్ద లేదా గట్టి పడడం, చనుమొన మీద ఎరుపు దద్దుర్లు రావడం, చనుమొన నుంచి ద్రవాలు రావడం, తిరిగి ఉండడం, చర్మంపై గుంటలు పడడం వంటి రొమ్ము క్యాన్సర్ లక్షణాలని తెలిపారు. అలాగే ఉబ్బరం, పొత్తి కడుపు నొప్పి, తిన్న వెంటనే కడుపు ఉబ్బరంగా అనిపించడం, తరచూ మూత్ర విసర్జనకు వెళ్లాలని అనిపించడం వంటివి అండాశయ కాన్సర్ లక్షణాలని, అలాగే, అసాధారణ రక్తస్రావం, సెక్స్ తర్వాత రక్తస్రావం, మూత్ర విసర్జన సమయంలో నొప్పి, మెనోపాజ్ తర్వాత దుర్వాసనతో కూడిన వైట్ డిశ్చార్జి అవడం వంటివి సర్వైకల్ క్యాన్సర్ లక్షణాలని చెప్పారు.

చైతన్యం చేస్తేనే అడ్డుకట్ట

అందరూ సమష్టి కృషి చేస్తేనే క్యాన్సర్‌కు అడ్డుకట్ట వేయడం సాధ్యమవుతుంది. అమెరికా లాంటి దేశాల్లో ఏడాదికోసారి క్యాన్సర్‌కు సంబంధించిన స్క్రానింగ్ చేయించుకుంటారు. మన దేశంలో, రాష్ట్రంలో ఇలాంటి చైతన్యం రావాలి. నిజానికి ఈ మధ్యకాలంలో చాలా మంది మహిళలు సర్వైకల్ క్యాన్సర్ బారిన పడుతున్నారు. ఈ వ్యాధి లక్షణాలను ముందుగా గుర్తిస్తే.. రెండు డోసుల ద్వారా 95 శాతం నివారించవచ్చు. కానీ, చాలా మందికి ఈ విషయం తెలియక చివరి నిమిషంలో ట్రీట్‌మెంట్ కోసం వస్తున్నారు. ఆ సమయంలో వైద్యులు చికిత్స అందించినా.. ఆశించిన ప్రయోజనం ఉండడం లేదు. మా పరిశీలన ప్రకారం.. క్యాన్సర్ వ్యాధి లక్షణాలపై చాలా మందికి అవగాహన ఉండడం లేదు. ఆ కారణంగానే ప్రాణాల మీదకు తెచ్చుకునే పరిస్థితి ఉంటున్నది. అందుకే విస్తృతంగా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి.. మహిళలను చైతన్యం చేయాల్సిన అవసరమున్నది. అప్పుడే ఈ ముప్పునకు అడ్డుకట్ట వేయచ్చు. అన్ని రకాల క్యాన్సర్లకు సంబంధించి నేటి నుంచి ప్రారంభమయ్యే శిబిరంలో నిపుణులు విలువైన సూచనలు ఇస్తారు. ఈ తరహా శిబిరాలు గ్రామగ్రామాన నిర్వహించాలి. ఈ విషయంలో స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ, ప్రైవేట్ దవాఖానలు విస్తృత అవగాహన కల్పించాలి. అంతేకాదు, క్యాన్సర్లకు వ్యతిరేకంగా జరిగే పోరాటంలో సంఘాలు, వ్యవస్థలతోపాటు ప్రతి ఒక్కరూ ప్రధానంగా భాగస్వాములవ్వాలి. ప్రత్యేక ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేయడం, ఆధునిక పద్ధతుల్లో స్క్రీనింగ్, నాణ్యమైన చికిత్స, టీకా కార్యక్రమాల వంటివి అందుబాటులోకి వస్తే ఈ ముప్పు నుంచి బయటపడే అవకాశమున్నది.

- బీ మాధవి, గైనకాలజిస్ట్

కలిసికట్టుగా పనిచేద్దాం

వచ్చే ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురడం ఖాయం

రాష్ట్రాన్ని దేశంలో అగ్రగామిగా నిలిపిన ఘనత కేసీఆర్‌దే

బండి ఐదేళ్లలో నయా పైసా అభివృద్ధి చేయలే..

వారంటీ లేని గ్యారంటీలిచ్చి ఆగం చేసిన కాంగ్రెస్

మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్

హుజూరాబాద్ / హుజూరాబాద్ టౌన్, ఫిబ్రవరి 3 : బీఆర్ఎస్ కార్యకర్తలందరూ కలిసికట్టుగా పనిచేస్తే వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరడం ఖాయమని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికలు వస్తాయి.. పోతాయి కానీ, గులాబీ జెండా మాత్రం ప్రజలకు ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. ఎంపీగా బండి సంజయ్ ఐదేళ్లలో నయా పైసా అభివృద్ధి చేయలేదని విమర్శించారు. హుజురాబాద్ పట్టణంలోని సాయిరూప గార్డెన్‌లో శనివారం ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి కృతజ్ఞత సభ నిర్వహించారు. దీనికి వినోద్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ నిజాన్ని ప్రజలు నమ్మకుండా చేసి పచ్చి అబద్ధాలు ప్రచారం చేశాయని విమర్శించారు. మనం చేసిన అభివృద్ధిని వివరిస్తే మళ్లీ అధికారంలోకి వచ్చేవాళ్లమని అభిప్రాయపడ్డారు. ఏదేమైనా తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలిపారని కొనియడారు. వారంటీలేని గ్యారెంటీలు ఇచ్చి కాంగ్రెస్ ప్రజలను ఆగం చేసిందని, అయితే వాటిని అమలు చేసేదాకా కాంగ్రెస్ నాయకులను నిలదీయాలని బీఆర్ఎస్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ముఖ్యంగా రైతుల వరి ధాన్యం బోనస్ సాధించేందుకు ఇప్పటి నుంచే ప్రణాళికలు మొదలు పెడుతామన్నారు. గత ప్రభుత్వ పథకాలను అభివృద్ధి నిధుల కింద చూపించడం కేవలం బండి సంజయ్‌కే చెల్లుతుందని, ఎంపీగా ఆయన కేంద్రం నుంచి సొంతంగా ఒక ట్రిబుల్ ఐటీ కళాశాల తెస్తే ఈ ప్రాంతం అభివృద్ధి జరిగేదన్నారు. ఎంపీగా తాను ఉన్నప్పుడు కరీంనగర్‌ను స్మార్ట్ సిటీగా, కేబుల్ బ్రిడ్జీ కోసం కృషి చేసినట్లు గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గెల్లు శ్రీనివాస్, మున్సిపల్ చైర్‌పర్సన్, చైర్మన్ గందె రాధిక, తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు, కేడీసీసీ వైస్ చైర్మన్ పింగిళి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

తల తెగినా గులాబీని వీడేది లేదు

అభివృద్ధి చేశా కాబట్టే మళ్లీ గెలిచా. నా గెలుపులో వినోద్‌కుమార్ పాత్ర చాలా ఉంది. కరీంనగర్‌ను స్మార్ట్ సిటీగా తయారు చేసేందుకు వినోద్‌కుమార్ కేంద్రాన్ని ఒప్పించాడు. అసెంబ్లీ ఎన్నికల్లో శత్రువులు ముప్పేట దాడి చేసినా ప్రజలు నాకు అండగా ఉన్నారు. వాళ్లకు ప్రత్యేక కృతజ్ఞతలు. బండి సంజయ్ కరీంనగర్‌కు చేసిన అభివృద్ధి శూన్యం. అందుకే ఆయన్ను ప్రజలు ఆదరించలేదు. వచ్చే ఎన్నికల్లో కార్యకర్తలు కసిగా పని చేసి వినోద్‌కుమార్‌ను గెలిపించాలి. కాంగ్రెస్ అధికారంలో ఐదేళ్లు ఉంటదో.. ఊడుతదో తెలియదు కానీ, ఉద్యమ పార్టీగా బీఆర్ఎస్ ఎప్పుడూ ప్రజల్లో ఉంటుంది. తల తెగినా గులాబీని వీడేది లేదు. అధికారంలో లేమని అధైర్య పడకండి. ఎల్లవేళలా కార్యకర్తలకు అండగా ఉంటాం.

- కరీంనగర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్

కార్యకర్తల సమిష్టి కృషితోనే గెలిచా

కార్యకర్తల సమిష్టి కృషితోనే ఎమ్మెల్యేగా గెలిచా. త్వరలోనే మనందరికీ మంచి రోజులు వస్తాయి. ఎవరూ నారాజు కావద్దు. అందరికీ అండగా ఉంటా. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చేదాక విశ్రమించను. పార్లమెంట్ ఎన్నికల్లో వినోద్‌కుమార్‌కు బ్రహ్మాండమైన మెజార్టీ వచ్చేందుకు ప్రతి కార్యకర్తా పని చేయాలి. గత పార్లమెంట్ ఎన్నికల్లో ఈ నియోజకవర్గంలో 55 వేల మెజార్టీ వచ్చింది. ఇప్పుడు అంతకంటే ఎక్కువగా ఇచ్చేందుకు కార్యకర్తలు, నాయకులు శ్రమించాలి.

- పాడి కౌశిక్‌రెడ్డి, హుజూరాబాద్ ఎమ్మెల్యే

ఆలయ చైర్మన్‌కు ₹5 లక్షల నగదు అందజేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

అంబరాన్నంటేలా వెంకన్న బ్రహ్మోత్సవాలు

- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- ఉత్సవాలకు ₹5 లక్షల విరాళం

కరీంనగర్ కమాన్ చౌరస్తా, ఫిబ్రవరి 3: కరీంనగర్‌లోని మార్కెట్ రోడ్ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను అంబరాన్నంటేలా నిర్వహించుకుందామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. శనివారం ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, ఆలయ ప్రాంగణంలో అధికారులు, నాయకులు, ఉత్సవ కమిటీ బాధ్యులు, దాతలతో సమీక్షించారు. అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారులతో సమావేశమై మాట్లాడారు. ఈ నెల 14 నుంచి 21 దాకా శ్రీ లక్ష్మీ, పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి సప్తమ వార్షిక బ్రహ్మోత్సవాలను అత్యంత పారదర్శకంగా, రాజకీయాలకు అతీతంగా నిర్వహించాలన్నారు. జిల్లాలోని ప్రతి ఇంటికీ వేడుకల ఆహ్వానం అందించాలని సూచించారు. ఈ సందర్భంగా ఉత్సవాల కోసం తన వంతుగా ₹5లక్షల నగదును ఆలయ వ్యవస్థాపక చైర్మన్ చకిలం శ్రీనివాస్‌కు అందజేశారు. తన లాగే శ్రీవారి బ్రహ్మోత్సవాలకు భక్తులు సమర్పించే విరాళాలు, కానుకలకు సంబంధించిన పూర్తి వివరాలు, ఖర్చుల వివరాలను పకడ్బందీగా రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. ఉత్సవాల సందర్భంగా ఆయా శాఖల అధికారులు చేపట్టాల్సిన కార్యక్రమాలను ముందుగానే సమీక్షించుకోవాలని సూచించారు. అధ్యయనోత్సవాల నుంచి శోభాయాత్ర దాకా ఎక్కడా ఎటువంటి అవాంతరాలు తలెత్తకూడదని, శానిటేషన్ ఇబ్బందులు తలెత్తకుండా మున్సిపల్ శాఖ ద్వారా స్పెషల్ డ్రైవ్ చేపట్టాలన్నారు. వేడుకల్లో కచ్చితమైన ప్రోటోకాల్ ను పాటించాలని, రోజూవారీ కార్యక్రమాలకు సంబంధించి మినిట్ టూ మినిట్ షెడ్యూల్‌ను రూపొందించాలని చెప్పారు. ఇక బ్రహ్మోత్సవాల మరుసటి రోజు నుంచి ప్రారంభమయ్యే సమ్మక్క – సారలమ్మ జాతర కోసం శాశ్వత ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ, గతంలో నిర్వహించిన కార్యక్రమాలను పరిగణలోకి తీసుకొని ఇప్పుడు నిర్వహించనున్న కార్యక్రమాల ప్రణాళికను రూపొందించాలని, దేవాదాయ శాఖ ద్వారా ఉత్సవాలకు సంబంధించి రికార్డులను నిర్వహించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. ఇక్కడ మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, డీఆర్‌వో పవన్ కుమార్, డీఎఫ్‌ఓ బాలామణి, ఆర్డీఓ మహేశ్వర్, డీఎంహెచ్‌వో లలితాదేవి, ఎలక్ట్రిసిటీ ఎస్ఈ గంగాధర్, దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, టౌన్ ఏసీపీ నరేందర్, జిల్లా పశు వైద్య, పర్సనల్ వర్ధక శాఖ అధికారి డాక్టర్ నరేందర్, వ్యవస్థాపక ధర్మకర్తలు చకిలం శ్రీనివాస్, చకిలం గంగాధర్, ఆలయ ఈవో ఉడుతల వెంకన్న పాల్గొన్నారు.

కాంగ్రెస్‌వి 420 హామీలే

- ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చింది
- సంజయ్ కరీంనగర్ అభివృద్ధికి పైసా పనిచేయలే
- మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి
- రేవంత్ సర్కారుకు దమ్ముంటే ఈ యేడాదిలోగా 2లక్షల కొలువులకు నోటిఫికేషన్ ఇవ్వాలి
- మాజీ ఎంపీ వినోద్‌కుమార్



మాజీ ఎంపీ వినోద్‌కుమార్, ఎమ్మెల్యే మల్లారెడ్డికి నాగలిని బహూకరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

గంగాధర, ఫిబ్రవరి 3: 'గత ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన వన్నీ 420 హామీలే. దొంగ హామీలు ఇచ్చి, ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చింది. మరి ఇచ్చిన వాగ్దానాలు అమలు చేస్తున్నదా..? అంటే చేసినట్లే చేసి ప్రజలను మభ్యపెడుతున్నది.' అంటూ మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి మండిపడ్డారు. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌ని మొండి సంజయ్ అనుకోవాలని, ఉత్త మాటలు చెప్పడమే తప్ప నిధులు తేవడం ఆయనకు చేతకాదని విమర్శించారు. వినోద్ కుమార్ లాంటి మేధావిని గెలిపించి పార్లమెంట్‌కు పంపిస్తే కరీంనగర్‌కు స్మార్ట్ సిటీని, రైల్వే ఓవర్ బ్రిడ్జ్‌ను తెచ్చినట్టు అనేక అభివృద్ధి పనులకు నిధులు తెస్తారని పేర్కొన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో గులాబీ జెండాను ఎగురవేయడానికి కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. గంగాధర మండలం మధురానగర్‌లోని వీఏఎస్ గార్డెన్‌లో శనివారం నిర్వహించిన చొప్పదండి నియోజకవర్గ స్థాయి బీఆర్ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమావేశానికి మాజీ ఎంపీ వినోద్‌కుమార్‌తో కలిసి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడారు. ఒకనాడు ఎట్లుండె తెలంగాణ.. ఇప్పుడెట్ల అయిందో గమనించాలని, రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి దేశంలోనే నెంబర్ వన్‌గా నిలిపిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని కొనియాడారు. కేసీఆర్ ప్రభుత్వంలో ఇంటింటికీ సంక్షేమ ఫలాలు అందాయన్నారు. మిషన్ కాకతీయ కింద చెరువులను పునరుద్ధరించి, రాష్ట్రంలోని 40 వేల చెరువులకు కేసీఆర్ పూర్వ వైభవం తెచ్చారని, కోటి ఎకరాలకు సాగు నీరందించారని గుర్తు చేశారు. పల్లె ప్రగతితో గ్రామాలను అన్ని రంగాల్లో తీర్చిదిద్దారన్నారు. వచ్చే ఎంపీ ఎన్నికల్లో రాష్ట్రంలో గులాబీ జెండా ఎగరడం ఖాయమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం దొంగ హామీలతో అధికారంలోకి వచ్చిందన్నారు. ఆ పార్టీ ప్రకటించిన గ్యారెంటీలన్నీ 420 హామీలనీ, వాటిని అమలు చేయడంలో ఫెయిల్ అవుతున్నారన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు, కరీంనగర్ జడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ గెల్లు శ్రీనివాస్ యాదవ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వీర్ల వెంకటేశ్వర్‌రావు, కొత్త జయపాల్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఏనుగు రవీందర్‌రెడ్డి, ఆరు మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నిజాలు దాచి అబద్ధాలతో గెలిచిన్రు

గడిచిన ఐదేండ్లలో రేవంత్‌రెడ్డి, బండి సంజయ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్, బీజేపీ కలిసి పనిచేశాయి. నిజాలు దాచి, అబద్ధాలు ప్రచారం చేశాయి. కాంగ్రెస్ వారంటీలేని గ్యారెంటీలు ఇచ్చి, పూర్తి అబద్ధాలతో గెలిచింది. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పదేండ్లలో రాష్ట్రాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపిండు. 1,60,083 ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చిండు. కేసీఆర్ భర్తీ చేసిన ఉద్యోగులకు రెండు నెలలుగా జీతాలు ఇచ్చారో..? లేదో..? సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్సీ కోదండరాం రెడ్డి సమాధానం చెప్పాలి. కేసీఆర్ ప్రభుత్వం 7వేల స్టాఫ్ నర్సు ఉద్యోగాలకు పరీక్ష నిర్వహిస్తే.. సీఎం రేవంత్ రెడ్డి నియామక పత్రాలు ఇచ్చి, ఆ ఉద్యోగాలు వాళ్లే ఇచ్చినట్లు మాట్లాడడం విడ్డూరంగా ఉన్నది. స్టాఫ్ నర్సు కొలువులే కాదు ఇంకా 40వేల ఉద్యోగాలకు పరీక్షలు నిర్వహించినం. కోర్టుల్లో కేసుల ద్వారా నియామకాలు జరగలేదు. మరో 32వేల ఖాళీలను కూడా గుర్తించినం. కాంగ్రెస్ సర్కారుకు దమ్ముంటే ఇచ్చిన హామీ